# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 27-03-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా ఇమ్మిగ్రేషన్ ఫారినర్స్ బిల్లు 2025కు లోక్‌సభ ఈరోజు ఆమోదం తెలిపింది.
- 'సహకార్' టాక్సీ విధానాన్ని ప్రభుత్వం త్వరలో ప్రారంభిస్తుందని కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా ప్రకటించారు.
- కనీస మద్ధతు ధర కంటే తక్కువకు రైతుల నుండి పంట ఉత్పత్తులను కొనుగోలు చేయట్లేదని కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు.
- భారత్ ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద 5G మార్కెట్‌గా అవతరించిందని కేంద్ర ఐటీ శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు.
- జమ్మూ కాశ్మీర్‌లో రెండు లక్షల కోట్ల రూపాయల విలువైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను చేపడుతున్నామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు.

======================

పార్లమెంట్ సమావేశాల్లో లోక్‌సభ ఈరోజు ఇమ్మిగ్రేషన్ ఫారినర్స్ బిల్లు 2025 ను కు ఆమోదం తెలిపింది. ఈ బిల్లు ఇమ్మిగ్రేషన్ చట్టాలను ఆధునీకరించడానికి తీసుకొచ్చామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. బిల్లుపై చర్చలో బాగంగా హోంమంత్రి మాట్లాడుతూ... పాస్ పోర్ట్‌లు, ప్రయాణ పత్రాలు, వీసా రిజిస్ట్రేషన్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి కొన్ని అధికారాలను కల్పించే నిబంధనలు ఈ బిల్లులో ఉన్నాయని బహుల చట్టాల సమస్యను ఇది పరిష్కరిస్తుందని తెలిపారు. ఈ బిల్లు జాతీయ భద్రతను బలోపేతం చేయడంతో పాటూ భారతీయ విశ్వవిద్యాలయాల ప్రపంచ స్థాయి ప్రమాణాలను నిర్ధారిస్తుందని వెల్లడించారు. పరిశోధన, తయారీ రంగాలకు ఇది దోహదపడుతుందని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

మరో చర్చలో సైతం అమిత్ షా మాట్లాడుతూ.. ఉబర్, ఓలా తరహాలో 'సహకార్' టాక్సీని ప్రభుత్వం త్వరలో ప్రారంభిస్తుందని ప్రకటించారు. సహకార్ సే సమృద్ధికు అనుగుణంగా మరికొద్ది కొన్ని నెలల్లో, భారీ స్థాయిలో

సహకార టాక్సీ సర్వీసులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఇందులో వచ్చే  లాభం నేరుగా డ్రైవర్‌కు వెళ్తుందని చెప్పారు. సహకార్ సే సమృద్ధి" అనేది కేవలం నినాదం కాదని, దానిని సాకారం చేయడానికి సహకార మంత్రిత్వ శాఖ ఎంతో కృషి చేస్తోందని  అమిత్ షా మాట్లాడుతూ...

(వాయిస్ 30 సెకన్లు)

=======================

కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ ఇచ్చిన సభా హక్కుల తీర్మానం (ప్రివిలేజ్ మోషన్) నోటీసును రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ తోసిపుచ్చారు. అమిత్ షా వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేష్ సభలో ఈరోజు  నోటీసును ప్రవేశపెట్టారు. ఈ నోటీసును చైర్మన్ తిరస్కరిస్తూ.. తాను దానిని జాగ్రత్తగా పరిశీలించానని, మంత్రి తన వ్యాఖ్యలపై సమర్పించిన పత్రం ద్వారా నిరూపించబడిందని జగదీప్ ధన్‌ఖర్ అన్నారు. పార్లమెంట్ సభ్యుల ప్రవర్తనకు నూతన మార్గదర్శకాలను రూపొందించాలని చైర్మన్ ఎథిక్స్ కమిటీని కోరారు.

=======================

భారత్ ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద 5G మార్కెట్‌గా అవతరించిందని కేంద్ర ఐటీ శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ... ప్రభుత్వం దృష్టి సారించినందున, వివిధ రంగాలు ప్రాథమికంగా పరివర్తన చెందుతున్నాయని దాదాపు 11 లక్షల కోట్ల పెట్టుబడులు ఆయా రంగాల్లో నమోదయ్యాయని వెల్లడించారు. 10 సంవత్సరాల క్రితం దేశంలో ఎలక్ట్రానిక్స్  తయారీ చాలా తక్కువగా ఉండేదని కానీ ప్రస్తుతం అది ఎగుమతి వస్తువులలో అగ్రగామిగా మారిందని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. ప్రపంచ దక్షిణాది దేశాలు భారతదేశం యొక్క UPI చెల్లింపు వ్యవస్థ పట్ల ఆసక్తి కనబరుస్తున్నారని తెలిపారు. ఈ సంవత్సరం భారత్ తన మొట్ట మొదటి 'మేడ్ ఇన్ ఇండియా' చిప్‌ను విడుదల చేయాలని యోచిస్తోందని అశ్విని వైష్ణవ్ ప్రకటిస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

=======================

కనీస మద్దతు ధర కంటే తక్కువకు రైతుల నుండి పంట ఉత్పత్తులను కొనుగోలు చేయట్లేదని కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు సానుకూలంగా ఉందని వారి శ్రేయస్సు కోసం పూర్తి నిబద్ధతతో నిరంతరం పని చేస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలు కనీస మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు జరగకుండా చూసుకోవాలని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణలో కనీస మద్దతు ధరకు కందుల సేకరణ కొనసాగుతోందని తెలియజేశారు. ఈ నెల 25వ తేదీ నాటికి, ఈ రాష్ట్రాల్లో మొత్తం 2.46 లక్షల మెట్రిక్ టన్నుల కందులను సేకరించామని తద్వారా 1.71 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు.

విరామం

=======================

దేశంలో విమాన టిక్కెట్ల ధరలను తగ్గించడానికి ఏవియేషన్ టర్బైన్ ఇంధనం (ATF) పై విలువ ఆధారిత పన్ను VAT  తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను కోరిందని పౌర విమానయాన మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు. విమాన టిక్కెట్ ధరపై ఈరోజు లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ... విమాన ఛార్జీల ధరలో 45 శాతం ATF వల్లే అధికంగా ఉంటున్నాయని, కొన్ని రాష్ట్రాలు ఈ ఇంధనంపై 29 శాతం VAT విధిస్తున్నాయని చెప్పారు. కొన్ని రాష్ట్రాలు ఏవియేషన్ టర్బైన్ ఇంధనంపై VATను 5 శాతం కంటే తక్కువకు

తగ్గించాయని తెలిపారు. విమాన ఛార్జీలు డిమాండ్ ఆధారంగా ఉంతాయని, ప్రభుత్వం విమాన టిక్కెట్ల ధరలను నిర్ణయించదని రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు.

======================

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిత వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని తమిళనాడు అసెంబ్లీ తీర్మానం చేసింది. ఈ బిల్లును, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ అసెంబ్లీలో ప్రవేశపెడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బిల్లు రాజ్యాంగంలో పొందుపరచబడిన ప్రాథమిక హక్కులకు విరుద్ధమని వక్ఫ్ బోర్డు అధికారాలను దెబ్బతీస్తుందని అన్నారు. ఏ ప్రభుత్వం అయినా మైనారిటీల హక్కులను పరిరక్షించడానికి కృషి చేయాలని ప్రతిపాదించిన తీర్మానంలో పేర్కొన్నారు. ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడిఎంకె, పిఎంకె పార్టీల మద్దతుతో ఈ బిల్లు ఈరోజు అసెంబ్లీలో ఆమోదించబడింది. బిజెపి సభ్యులు బిల్లును వ్యతిరేకిస్తూ వాకౌట్ చేశారు.

======================

ఆసియాలోనే అతి పొడవైన సొరంగమైన జమ్మూ కాశ్మీర్‌లోని జోజిలా టన్నెల్ పనులు దాదాపు 70 శాతం పనులు పూర్తయ్యాయని కేంద్ర రోడ్డు రవాణా రహదారుల శాఖా మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. లోకసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఈరోజు ఆయన సమాధానమిస్తూ... శ్రీనగర్ లడఖ్ ప్రాంతాలను అనుసంధానం చేయడానికి ఈ ప్రాజెక్టును ఐదు వేల 500 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్నారని తెలిపారు. జోజిలా టన్నెల్ ప్రాజెక్టులో 13 కిలోమీటర్లకు పైగా సొరంగం నిర్మాణం జరుగుతోందని 17 కిలోమీటర్లకు పైగా సొరంగానికి అనుబంధ రహదారులు ఉంటాయని మొత్తం 30 కిలోమీటర్లకు పైగా ఈ ప్రాజెక్టు పొడవు ఉంటుందని పేర్కొన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో 2 లక్షల కోట్ల రూపాయల విలువైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను చేపడుతున్నామని నితిన్ గడ్కరీ పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

======================

జమ్మూ కాశ్మీర్‌లోని కథువా జిల్లాలో ఈరోజు ఉగ్రవాదులు భద్రతా దళాల మధ్య మళ్ళీ ఎదురుకాల్పులు జరిగాయి. గత నాలుగు రోజులుగా ఇక్కడ భారీ ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ జరుగుతోంది. రాజ్‌బాగ్‌లోని ఘాటి జుతానా ప్రాంతంలో ఈరోజు ఉదయం భద్రతా దళాలు ఉగ్రవాదులను గుర్తించగా ఈ కాల్పులు చేసుకున్నాయి.

======================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 77,288 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై... చివరికి 317 పాయింట్ల లాభంతో 77,606 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 105 పాయింట్లు లాభపడి 23,591 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.79 గా ఉంది.

======================

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) లో భాగంగా హైదరాబాద్ వేదికగా ఈరోజు సన్ రైజర్స్ హైదరాబాద్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. తొలిత టాస్ గెలిచి లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. కడపటి వార్తలు అందే సమయానికి సన్ రైజర్స్ హైదరాబాద్ 8 ఓవర్లకు 3 వికెట్ నష్టానికి 80 పరుగులు చేసింది.

======================
======================